క్లుప్తంగా

మక్బూల్‌కు ముస్లిం ఐక్యవేదిక శుభాకాంక్షలు



మక్బూల్ అహ్మద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లిం ఐక్యవేదిక నాయకులు

కదిరి అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్‌ను ఆయన నివాసంలో బుధవారం ముస్లిం ఐక్యవేదిక నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలకు సంబంధించిన పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో ముస్లిం మైనార్టీ ఐక్యవేదిక ప్రతినిధులు ఖలీల్ సయ్యద్, అబ్దుల్ కలాం సయ్యద్, సభ్యులు అబ్దుల్లా సాహెబ్, ఇమామ్, మౌలా బేగ్, రియాజ్ తదితరులు ఉన్నారు.

గర్భిణులకు అన్నదానం



గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఓడీచెరువు: ప్రతి నెలా 9న రోటరీ క్లబ్ కదిరి ఆధ్వర్యంలో గర్భిణులకు అన్నదానం చేస్తున్నట్లు డాక్టర్ కమల్ రోహిత్ తెలిపారు. బుధవారం రంజిత్, సాగర్ కుటుంబ సభ్యులు భోజనం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో 49 మంది గర్భిణులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

21న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో ఈనెల 21వ తేదీన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఉంటుందని అందరివాడు ఉత్సవ సొసైటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హాజరవుతారన్నారు.

సంతకాల సేకరణ



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కౌన్సిలర్ మేడాపురం వెంకటేష్

ధర్మవరం: పట్టణంలోని 25వవార్డు సచివాలయంలో బుధవారం కౌన్సిలర్ మేడాపురం వెంకటేష్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ విగ్రహం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వార్డు కన్వీనర్లు, ప్రజలు పాల్గొని ప్రతిజ్ఞ చేశారు.

రస్తా సమస్యపై ఘర్షణ

బత్తలపల్లి: రస్తా సమస్యపై బుధవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. బత్తలపల్లి పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. మండలంలోని డి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన బోయ నరసింహులు వ్యవసాయ పొలం వద్దకు వెళుతుండగా అదే గ్రామానికి చెందిన లోకేశ్వరనాయుడు రస్తాకు బండి అడ్డుపెట్టాడు. దీంతో ఇరువర్గాల వారు ఘర్షణకు దిగారు. లోకేశ్వరనాయుడు, బాలచంద్రనాయుడు, వెంకటరమణప్పలు, బోయ నరసింహులు, నరేష్ ఒకరినొకరు రాళ్లతో కొట్టుకున్నారు. వీరు ఐదుగురు గాయపడినట్లు తెలిపారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఓటుహక్కు వినియోగంపై సూచనలిస్తున్న ఆర్డీఓ

ఎన్పీకుంట: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కదిరి ఆర్డీఓ సన్నీవంశీక్రిష్ణ సూచించారు. బుధవారం మండల పరిధిలోని ధనియానిచెరువు గ్రామంలో ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానంపై రెవెన్యూ అధికారులతో కలిసి ఓటర్లకు అవగాహన కల్పించారు.

- మండల కేంద్రంలో తహసీల్దార్ నరేంద్ర కుమార్, రెవెన్యూ సిబ్బందితో పలు చోట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, పలు సూచనలు ఇచ్చారు. ఈవీఎం యంత్రంపై ఓటు వేసే విధానం గురించి అవగాహన కలిగినట్లయితే ఎన్నికల రోజు ఓటును వేయడానికి సులభతరం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిల్షాద్, వీఆర్ఓ కిష్టప్ప, వీఆర్ఏ రూపా, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

పైపుల ఏర్పాటు

నల్లచెరువు: మండల పరిధిలోని ఉప్పార్లపల్లి లోఅండర్ డ్రైనేజీ కాలువ పొంగి మురుగు నీరు రోడ్డుపైకి వచ్చి దుర్వాసన వెదజల్లేది. వలంటీర్లు మహేంద్ర, అష్రఫ్ ద్వారా విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి రమణప్ప నాయుడు బుధవారం జేసీబీతో కాలువ తవ్వించారు. పైపులు ఏర్పాటు చేసి కాలువ పూడ్చివేత పనులను చేయించారు.

దమ్మున్న నాయకుడు సీఎం జగన్



సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



ఎమ్మెల్యే కేతిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

• ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ముదిగుబ్బ: మీ కుటుంబానికి మంచి జరిగి ఉంటేనే ఆశీర్వదించండని అడిగే దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, అందుకే రాష్ట్రానికి మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని గంగిరెడ్డిపల్లి, కొడవండ్లపల్లి, ఇందుకూరు గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. పలువురు పింఛన్లు, భూ సమస్యలను వివరించగా వాటిపై సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ప్రభుత్వ పరంగా సమస్యలను పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. జగనన్న సీఎంగా సంతకం చేసిన క్షణం నుంచే రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా అన్ని వర్గాల వారికి పథకాలు అందుతున్నాయన్నారు. పేదలు ఆత్మస్థైర్యంతో జీవించే పరిస్థితి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉందని పేర్కొన్నారు. భావితరాల బంగారు భవిత కోసం మరో 30 ఏళ్ల పాటు జగన్ పాలన కొనసాగాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రతిపక్షాల మాయమాటలు నమ్మితే ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ వర్గాలు మోసపోతాయన్నారు. అంతకు ముందు ఆయా గ్రామాల్లో నాయకులు ఎమ్మెల్యేకి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకరరెడ్డి, మండల కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి, మండల ఇన్‌చార్జ్ ఇందుకూరు నారాయణరెడ్డి, సర్పంచు పద్మావతి, ఎంపీటీసీ మధుసూదనాదేవి, నాయకులు రమణారెడ్డి, వెంగళరెడ్డి, రామమోహన్‌రెడ్డి, ద్వారకనాథ్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, మీసాల నాగిరెడ్డి, రమణారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, మునిచంద్ర, వెంకటేశ్వరరెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

ముదిగుబ్బ మండలం ఇందుకూరు గ్రామంలో పలువురు టీడీపీ నాయకులు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, కృపాకర్‌రెడ్డి, రామ్‌మోహన్‌రెడ్డి, వెంకట రఘునాథ్‌రెడ్డి, వెంగళరెడ్డి, కృష్ణారెడ్డి, శంకర్‌రెడ్డి, ప్రసాద్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఇందుకూరు గ్రామస్తులు వైఎస్సార్‌సీపీలో చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సీపీ నారాయణ రెడ్డి, మండల ఇన్‌చార్జ్ ఇందుకూరు నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పల్లె ప్రగతికి ప్రభుత్వం కృషి



తారు రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

ఎన్పీకుంట: పల్లెల ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కదిరి–రాయచోటి ప్రధాన రహదారి నుంచి వంకమద్ది మీదుగా పెద్దరాంపల్లి వరకు సుమారు రూ.2.92 కోట్ల ఏపీఆర్ఆర్‌పీ, రూ.67 లక్షల ఉపాధిహామీ నిధులతో 5.85కి.మీ నూతనంగా నిర్మించిన తారు రోడ్డును నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంకమద్ది పంచాయతీలో దశాబ్దాల కాలంగా కనీస రహదారి సౌకర్యం లేని గురికానివారిపల్లి, పెద్దరాంపల్లి గ్రామాలకు నాణ్యతతో కూడిన రహదారి ఏర్పాటు చేసి, ప్రారంభించామన్నారు. కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా అత్యవసరాల నిమిత్తం 108, 104 వాహనాలు కూడా వెళ్లలేని సుమారు 140 కు పైగా గ్రామాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పెద్ద ఎత్తున రోడ్డు సౌకర్యం కల్పించామని తెలిపారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపి, దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈటెరాము, ఎంపీటీసీ, మండల కన్వీనర్ కొత్తరంగారెడ్డి, స్థానిక సర్పంచ్ ఈటెరాధ, ఎంపీడీఓ ఆదినారాయణ, కోఆప్షన్ సభ్యులు సుబహాన్, జేసీఎస్ కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్లు బయారెడ్డి, ఓబుళరెడ్డి, క్రిష్టారెడ్డి, యూత్‌కన్వీనర్ వేణుగోపాల్‌యాదవ్, బీసీసెల్ ఆదెప్పనాయుడు, సర్పంచ్ విష్ణుమూర్తి, గ్రామకన్వీనర్ వెంకటేశ్వర్లు, రామక్రిష్ణ, సామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సమన్వయకర్త మక్బూల్ పర్యటన



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎన్పీకుంట: కదిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ గురువారం మండలంలో పర్యటించనున్నారని ఆ పార్టీ మండల కన్వీనర్ కొత్త రంగారెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు జగదీశ్వరరెడ్డి, బీసీనేత బాలక్రిష్ణనాయుడు తెలిపారు. బుధవారం స్థానిక సింగిల్ విండో అధ్యక్షుడు జగదీశ్వరరెడ్డి స్వగృహంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మక్బూల్ అహ్మద్ సమన్వయకర్త హోదాలో మొదటిసారి మండల కేంద్రానికి విచ్చేస్తున్న సందర్భంగా ఘనంగా స్వాగతం పలికి, మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు వివరించారు. ఎంపీపీ, వైస్‌ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు తిరుమలనాయుడు, శ్రీరాములు, షామీర్‌బాషా, అల్లాబక్షు, పుల్లారెడ్డి, రంగారెడ్డి, రఘునాథ, చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

17న కంటి వైద్య శిబిరం



కరపత్రాలు విడుదల చేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 17న ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్షులు జయసింహా, కార్యదర్శి నాగభూషణ, క్యాంపు చైర్మన్ సుదర్శన్‌గుప్త తెలిపారు. స్థానిక సాంస్కృతిక మండలిలో బుధవారం రోటరీక్లబ్ సభ్యులు కంటి వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ బెంగళూరులోని శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులతో ఉచితంగా కంటి పరీక్షలు చేయించి అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేయిస్తామన్నారు. నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు నరేంద్రరెడ్డి, రమేష్‌బాబు, శివయ్య, హరి, సోలిగాళ్ల వెంకటేషులు, పెరుమాల్‌దాస్, కొండయ్య, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న

ధర్మవరం అర్బన్: ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. పట్టణంలోని చంద్రబాబునగర్ సచివాలయం వద్ద బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలందరికీ వైద్యం అందించాలనే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారని తెలిపారు. 296 మంది రోగులకు వైద్య ఆరోగ్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ మేనేజర్ ఆనంద్‌కుమార్, టీపీఆర్ఓ సుబ్బరాయుడు, మెడికల్ ఆఫీసర్లు గౌతమి, అర్జున్, రవితేజ, వాసంతి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తి చాటాలి



టాస్ వేస్తున్న ఎంపీడీఓ రామానాయక్

గాండ్లపెంట: క్రీడా స్ఫూర్తిని చాటాలని ఎంపీడీఓ రామానాయక్ తెలిపారు. బుధవారం మండల స్థాయిలో విజయం సాధించిన జట్లతో తాలుకా స్థాయి ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. కురుమామిడి జట్టు సోమయాజుపల్లి జట్టుపై 4 వికెట్లు నష్టపోయి 20 పరుగులతో విజయం సాధించింది. కురుమామిడి సచివాలయం క్రీడాకారులు కబడ్డీలో, కటారుపల్లి గ్రామ సచివాలయం క్రీడాకారులు ఖోఖోలో నియోజకవర్గ స్థాయికి ఎంపికయ్యారు. ఎంపీడీఓ ఆ రెండు జట్లను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓతోపాటు గ్రామ సర్పంచ్ రహంతుల్లా,ఎంఈఓ క్రిష్టానాయక్, వైద్యాధికారి మహేశ్వరమారుతి, వైస్ ఎంపీపీ గంగోజమ్మ, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, స్థానిక నాయకులు సిద్దారెడ్డి, మైను, సూపర్‌వైజర్ ఉపేంద్రారెడ్డి, కార్యదర్శులు బాషా, రవి,శంకర్,రియాజ్, ఓబులమ్మ, భవాని, క్రీడాకారులు పాల్గొన్నారు.

నల్లచెరువులో..

నల్లచెరువు: మండల కేంద్రంలోని తాటిచర్ల బ్రదర్స్ క్రీడా మైదానంలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలను బుధవారం ఎంపీడీఓ శకుంతల, తహసీల్దార్ రవికుమార్, సర్పంచ్ పంచరత్నమ్మ ఘనంగా ప్రారంభించారు. ఎం అగ్రహారం, అల్లుగుండు గ్రామాలకు జరిగిన క్రికెట్ మ్యాచ్‌ను అధికారులు టాస్ వేసి ప్రారంభించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో ఉత్తమ ప్రతిభ చూపి మండల స్థాయిలో పాల్గొన్న క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వసుంధర, రమణప్ప నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు సానే హరినాథ్‌రెడ్డి, పీఈటీ షఫి, ఖాదర్ వలి, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు





గాయపడిన నారాయణస్వామి, వెంకటేష్

బత్తలపల్లి: మండల కేంద్రంలో బుధవారం రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు గాయపడ్డారు. బత్తలపల్లి పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. గోరంట్ల మండలానికి చెందిన వెంకటేష్ ద్విచక్రవాహనంలో ధర్మవరం నుంచి బత్తలపల్లి వైపు వస్తున్నాడు. అప్పరాచెరువు గ్రామానికి చెందిన చంటి అలియాస్ నారాయణస్వామి బత్తలపల్లి నుంచి ధర్మవరం వైపు ద్విచక్రవాహనంలో వెళుతుండగా రెండు వాహనాలు ఐసీడీఎస్ ఆఫీసు వద్ద ఢీ కొన్నాయి. ఇరువురూ గాయపడ్డారు. నారాయణస్వామి కాలు విరిగినట్లు పోలీసులు తెలిపారు.

- బత్తలపల్లికి చెందిన దుర్గేష్ కదిరి రోడ్డులో ద్విచక్రవాహనంపై వస్తూ నడుచుకుంటూ వెళ్తున్న వెంకటరాముడును ఢీ కొన్నాడు. వెంకటరాముడు గాయపడ్డాడు. ఘటనలపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పొలాలు చూపి రూ. 18 లక్షలకు కుచ్చు టోపీ

తనకల్లు: పొలాలు తనవేనంటూ రూ. 18.74 లక్షలకు కుచ్చు టోపీ పెట్టాడో ఘనుడు. చండీగఢ్ వాసి పునిత్‌నంద్ తనను మోసం చేసి రూ. 18.74 లక్షలు కాజేశాడని తమిళనాడుకు చెందిన శివప్రసాద్ బుధవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాల మేరకు.. పునిత్‌నంద తనకు తనకల్లు మండలం కొండవెనుపల్లి వద్ద వ్యవసాయ పొలాలు ఉన్నాయని, అందులో కలర్ బిల్డ్ పేరుతో రైతులకు సాయం చేయడానికి ఓ ప్రాజెక్టు చేపడుతున్నట్లు శివప్రసాద్‌ను నమ్మబలికాడు. గతేడాది గ్రామానికి తీసుకొచ్చి స్థానిక రైతులకు చెందిన పొలాలు చూపి తనవేనని బురిడీ కొట్టించాడు. ఎకరాకు రూ. 18.74 లక్షలు పెట్టుబడి పెడితే నెలకు రూ.9,357 చొప్పున 10 నెలలు చెల్లిస్తానని తెలిపాడు. దీంతో పునిత్‌నందకు శివప్రసాద్ రూ. 18.74 లక్షలను చెల్లించాడు. అయితే ఇంతవరకూ రూ. 1.03 లక్షలు మాత్రమే చెల్లించి ఆ తరువాత పునిత్‌నంద ముఖం చాటేశాడు. 6 నెలలుగా డబ్బు ఇవ్వాలని కోరుతున్నా అతడు పట్టించుకోకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కాగా, పునిత్‌నంద్ ఇలాంటి కేసులోనే చండీగఢ్ సబ్ జైల్లో ఉన్నట్లు తెలిసింది.

ముగ్గురు ముస్లిం బాలుర అప్పగింత



బాలురను హజరత్‌కు అప్పగిస్తున్న ఎస్ఐ రాజశేఖర్

తనకల్లు: మదరసా నుంచి వెళ్లిపోయిన ముగ్గురు ముస్లిం బాలురను పోలీసులు మదరసా సిబ్బందికి అప్పగించారు. కదిరికి చెందిన రియాన్, మదనపల్లి ఇందిరానగర్‌కు చెందిన అమాన్, సర్కారుతోపుకు చెందిన అబ్దులా మండల పరిధిలోని చీకటిమానిపల్లికి సమీపంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న మదరసాలో చదువుకుంటున్నారు. బుధవారం మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత ముగ్గురూ కలిసి ఎవరికీ చెప్పకుండా మదరసా నుంచి బయటకు వచ్చి దగ్గర్లోని రైల్వేట్రాక్ నుంచి నడుచుకుంటూ తనకల్లు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు బాలురను గమనించిన స్థానికులు వెంటనే ఎస్ఐ రాజశేఖర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్ఐ తన సిబ్బందితో కలిసి రైల్వేస్టేషన్‌లో ఉన్న ముగ్గురు బాలురను కలిసి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. విషయాన్ని మదరసా హజరత్ మహమ్మద్ ఇర్ఫాన్‌కు తెలియజేశారు. బాలురను హజరత్‌కు అప్పగించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు నారాయణస్వామి, వేమనారాయణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఐగా తిరుపాలు

బత్తలపల్లి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా తిరుపాలు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ముందుగా సీఐ ఆరోహణ రావును మర్యాదపూర్వకంగా కలిశారు.

పరామర్శ

కదిరి అర్బన్: మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో మోకాలి ఆపరేషన్ చేసుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. బత్తల హరిప్రసాద్ తండ్రి, మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ విశ్రాంతి తీసుకుంటున్నారు. బుధవారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ వేర్వేరుగా పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కదిరి అర్బన్: మండల పరిధిలోని యర్రదొడ్డి గ్రామ సమీపంలో బుధవారం పేకాట ఆడుతున్న ఏడుగురిని రూరల్ మండల పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.27,960 నగదు, 2 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు.

కేసు నమోదు

తన భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ కదిరి మండలం మాచిరెడ్డిపల్లికి చెందిన మాధవి బుధవారం రూరల్ మండల పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. భర్త భార్గవ్‌కుమార్, అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని వినతి

పుట్టపర్తి టౌన్: శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని కొత్తచెరువు మండలం గోరంట్లపల్లికి చెందిన పలువురు దళితులు కోరారు. ఈ మేరకు బుధవారం మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రామాంజనేయులురెడ్డికి వినతి పత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రామాంజనేయులు, రామప్ప, లక్ష్మీదేవి, కుళ్లాయమ్మ, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సీఐ అశోక్‌కుమార్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం సీఐ అశోక్‌కుమార్ చేతుల మీదుగా ఏఐఎస్‌బీ నూతన క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతలయ్య, జిల్లా సహాయ కార్యదర్శి సాయికిరణ్, పట్టణాధ్యక్షుడు వెంకీ, నియోజకవర్గ నాయకులు మురళి, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి విరాళం

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి మండలం సుబ్బరాయనిపల్లి గ్రామంలో నిర్మించ తలపెట్టిన రామాలయానికి ఉపాధ్యాయుడు క్రిష్టానాయక్ బుధవారం రూ.10,116 అందజేశారు. ఈసందర్భంగా దాతను ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో మాజీ సైన్నికుడు మహనంద, కేశవ, హరీష్, బొమ్మయ్య, నరసింహులు, దినేష్, మేకల నరసింహులు, జయచంద్ర, నాగరాజు, మధు, జయరామిరెడ్డి, రామక్రిష్టారెడ్డి ,సుబ్బరాయుడు తదితరులు ఉన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

ఓడీచెరువు: మండల పరిధిలోని సున్నంపల్లి రోడ్డు వద్ద ఒక బాక్సు కర్ణాటక మద్యం పట్టుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జున రెడ్డి తెలిపారు. బుధవారం సున్నంపల్లికి చెందిన మారెప్ప కుమారుడు తిప్పన్న బాక్సులో 96 టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.

గ్రామాల్లో పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి: మండలంలోని రాఘవంపల్లి, ఈదుల ముష్టూరు గ్రామాలలో రైతులు సాగు చేసిన కంది పంటలో అధికారులు కోత ప్రయోగాలను నిర్వహించారు. బుధవారం రాఘవంపల్లిలో 14–1బీ సర్వే నంబర్‌లో సరస్వతి సాగు చేసిన కందిలో 100 గ్రాములు దిగుబడి, ఈదుల ముష్టూరు గ్రామంలో 554–1బీ సర్వే నంబర్‌లో మంగమ్మ సాగు చేసిన కంది పంటలో 250 గ్రాములు దిగుబడి వచ్చినట్లు ఏఎస్ఓ డాక్టర్ లక్ష్మీనరసింహాశర్మ తెలిపారు. ఆయన మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద కంది పంటలో పంటకోత ప్రయోగాలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ ఉపేంద్రరెడ్డి, వీవీహెచ్ సత్యనారాయణ, బీమా అధికారి నాగభూషణం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌రెడ్డికి మాతృవియోగం

గాండ్లపెంట: వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తల్లి పోరెడ్డి అచ్చమ్మ (80) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి బుధవారం మృతురాలి స్వగృహానికి వెళ్లి పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ తాతం జగన్‌మోహన్, మండల కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కర్‌రెడ్డి, ఆర్బీకే అధ్యక్షుడు శంకర్‌నాయుడు, పలువురు వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు, సర్పంచులు, తదితర నాయకులు పాల్గొన్నారు.